# నేత్ర గవాక్షం

## శ్రీకంఠమూర్తి

ఆ కళ్లు ఆ వీధిలో ఎన్నో దృశ్యాలను చూస్తూ వుంటాయి. ఆ దృశ్యాల్లో కొన్ని సంతోషాన్ని కలిగించేవైతే, మరికొన్ని విషాదాన్ని కలిగిస్తూంటాయి ఆ కళ్లు రాజేంద్రవి.

ఆరోజు కూడా ఆ కళ్ళు వీధిలోకి చూస్తున్నాయ్. వీధిలోని దృశ్యాలు ఎప్పటిలా మామూలుగానే కనిపిస్తున్నాయి. ఆ దృశ్యాల్లో మార్పులేదు.

రాజేంద్ర దీర్ఘమైన నిట్టూర్పు విడిచి ఇటు తిరిగాడు అతనిప్పుడు తన కళ్లను గురించి ఆలోచించడం మొదలెట్టాడు. ఇప్పుడే-కాదు, ఎప్పుడూ-అంటే రోజూ కనీసం పది పన్నెండు సార్లన్నా ఆలోచిస్తూంటాడు- "ఆ కళ్ళే గనక లేకపోతే తన గతి ఏమయ్యేదో?" అని, కాళ్ళకు బదులు కళ్ళకే ఏమన్నా అయివుంటే? అమ్మో... ఇంకేమన్నా ఉందా? అని తల్చుకోవడానికే భయంగా ఉంటుంది రాజేంద్రకు.

"అబ్బాయ్...." అంటూ మెల్లిగా గదిలోకి వచ్చింది పార్వతమ్మ.

రాజేంద్ర ఆలోచనల్లోంచి తేరుకుని తల్లికేసి తిరిగి చూశారు. ఆవిడ చేతిలో ఏదో వస్తువున్నట్టుంది. అది వెనక్కి దాచుకుని కొడుకు మంచం దగ్గరికి నడిచి వచ్చింది.

రాజేంద్ర ప్రశ్నార్థకంగా చూశాడు తల్లివైపు ఆమె కొంచెం జంకుతూ "ఏం లేదురా అబ్బాయ్! ఇప్పుడె మద్రాసు నుంచి పుత్తరం వచ్చింది. ఉత్తరంతో బాటు ఈ కవరు కూడా వుంది. అందులో ఓ అమ్మాయి ఫోటో వుంది...."

ఆవిడ మాటలింకా పూర్తి కాకుండానే ఖస్సుమని లేచాడు రాజేంద్ర.

"నీకెన్నిసార్లు చెప్పానమ్మా! ఇలాంటి వ్యవహారాలేం పెట్టుకోవద్దని! అనవసరంగా ఒకమ్మాయి జీవితం నాశనం చేయడం ఎందుకు చెప్పు?" అన్నాడు.

ఆవిడ ముఖంలో ఆవేదన స్పష్టంగా కనిపించింది.

"నేనేం అంత కఠినాత్మురాల్ని కానురా. ఉన్న సంగతంతా ముందే చెప్పేశాను అంతా తెలిసి కూడా వాళ్లు తమ అమ్మాయి నివ్వడానికి ఒప్పుకుని ఈ ఫోటో పంపించారు" అంటూ ఫోటో ఉన్న కవరును పక్కనే వున్న టేబుల్ మీద వుంచింది పార్వతమ్మ.

"నువ్వు నిదానంగా ఆలోచించరా అబ్బాయ్....నేనున్నన్ని రోజులూ నీకే లోటు రాకుండా చూసుకోగలను కానీ, నేను పోయిం తర్వాత నిన్ను కనిపెట్టు కుని ఉండడానికి ఎవరైనా కావాలికదా!" అనేసి ఆవిడ అక్కడి నుంచి వెళ్ళి పోయింది.

రాజేంద్ర మనసంతా ఎలాగో అయి పోయింది. మళ్ళీ కిటికీ దగ్గరికెళ్ళి బయ టికి దృష్టి సారించాడు. రోడ్డుమీద కాస్త రద్దీ పెరిగింది. కొందరు జంటగా.... కొందరు ఒంటరిగా.. మరికొందరు జట్లుగా.... ఉత్సాహంతో ఉరకలు వేసి నట్టు నడుస్తున్నవారుకొందరైతే, ఉసూరో మంటూ అడుగులు వేస్తున్న వారు మరి కొందరు.

రాజేంద్ర అలా చూస్తూ ఉండగానే ఒక భార్యా భర్తల జంట నింపాదిగా నడచి వెళుతూంది. అతను మాటి మాటికీ ఆమెవైపు తిరిగి కొద్దిగా వంగి కళ్లెగరేస్తూ కొంటెగా ఏమేమో చెబుతున్నాడు. ఆమె సిగ్గుతో బుగ్గలు ఎర్రబారగా తలవంచు కుని నడుస్తూ నెమ్మదిగా జవాబులు చెబు తోంది. మధ్య మధ్యన ఒక్కసారి తలెత్తి అతని కళ్ళలోకి పరవశంగా చూస్తోంది.

ఆమె కళ్ళు ఎంత అందంగా ఉన్నాయో! ఆకళ్ళల్లోకి చూస్తూంటే ఎంత కాలమైనా ఇట్టే గడిచి పోతుంది. ఆమె భర్త నిజంగా అదృష్టవంతుడు....


అంతలో రాజేంద్ర దృష్టి ఇంకో జంట వైపు మరలింది. గున్న ఏనుగు లాంటి భార్య దర్జాగా నడిచి వెళ్తుంటే, సన్నగా పీలగా ఉన్న భర్త భయంగా ఒదిగొదిగి నడుస్తున్నట్టు వెళుతున్నాడు. అతని ముఖంలో సంతోషంకానీ, ఉత్సాహం కానీ మచ్చుకైనా లేవు ఛ! ఛ! అలాంటి బ్రతుకును తల్చుకోవడానికే రోత!

గబుక్కున కళ్లు మరోవైపుకు తిప్పే సుకున్నాడు రాజేంద్ర. ఎవరో ఇద్దరు చిన్న కుర్రాళ్లు పరిసరాల ధ్యాసే లేకుండా కబుర్లు చెప్పుకుంటూ వెళుతున్నారు. "నే నేమో పెద్దవాణ్ణయ్యాక పెద్ద క్రికెట్ ప్లేయర్‌నయిపోతా తెలుసా? అప్పుడు ఎంచక్కా ఊళ్ళన్నీ తిరగొచ్చు. వేలకు వేలమంది మన ఆట చూడడానికోసం పరి గెత్తుకొస్తారు.... నా ఆటోగ్రాఫులకోసం పడిగాపులు పడతారు... అబ్బ! ఊహిం చుకుంటూంటే నాకెంత సంతోషంగా ఉందో తెలుసా?" అని ఒకుర్రాడు అం టూంటే మరో కుర్రాడు "నేనయితే డాక్ట ర్నవుతానుబాబూ....క్రికెట్ ప్లేయరయితే ఏమొస్తుంది? డాక్టరవుతే చక్కగా ప్రజ లకు సేవచెయ్యొచ్చు. ఇంకా...." అంటూ ఏమేమో చెప్పుకుపోతున్నాడు.

వాళ్ళ మాటలు విని రాజేంద్రకు నవ్వొచ్చింది. అంతలో వాళ్లు అక్క ణ్ణుంచి వెళ్ళిపోయారుగానీ లేకపోతే ఇంకా ఏమేం మాట్లాడుకునేవారో. . ?

రాజేంద్ర నవ్వు మాయమై పెద్ద నిట్టూర్పు ఒకటి విడిచాడు,

ఒకప్పుడు తనూ క్రికెట్ ఆట గాడే! అయితే ఆకుర్రాడన్నట్టు ఊళ్ళు, దేశాలు తిరిగి ఆడేంత గొప్ప ఆటగాడేం కాకపోయినా తమ కాలేజీకి తనే బెస్ట్ ప్లేయర్! ఇప్పుడో? ఆడకపోతేపోయె కనీసం ఆటచూసే అదృష్టంకూడాఉందా?'




ఇలా మంచంపీదే బతుకు వెళ్ళమార్చే కంటే హాయిగా ఒకేసారి ప్రాణాలు పోయినా బాగున్ను!' అని ఎన్నోసార్లు అనుకుంటాడు గానీ-తనకంటే హీనంగా ఉండి కూడా పొట్ట కూటికోసం తిప్పలు పడుతున్న పేవ్‌మెంటుమీది బిచ్చగాణ్ని చూస్తూంటే తన బతుకే వేయిరెట్లు నయమనిపిస్తుంది. తెల్లారగానే వాణ్ణి ఒక తోపుడు బండిలో తీసుకొచ్చి చెట్టుక్రింద గోనె పట్టా పరచి దానిమీద పడుకోబెడతారు. పక్కనే ఒక గుడ్డముక్క పరుస్తారు. వాడికి కాళ్ళేకాక కళ్ళూలేవు ఇక అప్పట్నుంచి మొదలెడతాడు అరుపులు "బాబూ... రెండు కాళ్ళూలేని కుంటాణ్ని ... ధరమం సేయండి నాయనలారా. కళ్లులేని కబోదిని తండ్రీ .." అంటూ కేకలు పెడతాడు. రోడ్డుమీది మనుషుల అలికిడి తగ్గినపుడు కాసేపు మెదలకుండా ఉండి చేత్తో తన పక్కనున్న గుడ్డమీది డబ్బులు ఏరి మొలలో దోపుకుంటాడు. మధ్యాహ్నం పన్నెండు ఒంటిగంటప్పుడు ఒక సత్తుగిన్నెలో అన్నం, ఓడబ్బాలో నీళ్ళు తెచ్చిపెట్టేసి వెళ్ళిపోతాడు ఓ ఎనిమిదేళ్ళ కుర్రాడు బహుశా ఆ ముష్టివాడికొడుకేమో! ఆ అన్నం తిని డబ్బాలో నీళ్ళు తాగి మళ్ళీ కేకలు మొదలెడతాడు. చీకటి పడగానే ఓ ఆడదీ, ఓ మగాడూ వచ్చి వాణ్ణి మళ్ళీ బండిలో కూర్చోబెట్టి తీసుకెళ్ళిపోతారు. ఉదయంనుంచీ వాడు గొంతు ఎండిపోయేలా కేకలుపెట్టి సంపాదించిన డబ్బులన్నీ నిర్దాక్షిణ్యంగా లాక్కుంటారు. వాళ్ళిదరూ కర్మకాలి ఏ ఐదు పైసలో పదిపైసలో వాడు దాచుకున్నట్టు అనుమానం కలిగితే ఇక వాడి పాట్లు చెప్పనక్కరలేదు నానా బూతులూ తిట్టి పంచెకట్టు తడిమిచూసి మరీ లాక్కుంటారు. ఆ ఆడది కుంటాడి పెళ్లామే. అయినా వాడికంటే ఎక్కువ అధికారం చలాయిస్తాడు ఆమెతో వచ్చే మనిషి. ముష్టివాడు కిక్కురుమనకుండా ఊరుకుంటాడు. ఒకవేళ ఎప్పుడైనా నోరు తెరిచాడో ఇక తన్నులు తప్పవన్నమాటే!

ఇదంతా చూస్తుంటే రాజేంద్రలో ఆవేశం కట్టలు తెంచుకుని వస్తుంది. కోపంతో పిడికిళ్ళు బిగుసుకుపోతాయి. ఒక్క ఉదుటున వెళ్ళి ఆ ఇద్దర్నీ చితకతన్ని ఆ కుంటాడి డబ్బులను తిరిగిప్పించాలనిపిస్తోంది. కానీ తను అలా చేయలేకున్న విషయం గుర్తుకు రాగానే ఆవేశమంతా చప్పగా చల్లారిపోతుంది.

అయినా వాడి బతుక్కంటే తన బతుకు వేయి వేయేమిటి లక్ష రెట్లు నయం. తనకు యిల్లుంది, వాకిలుంది, పడుకోవడానికి మంచం, మెత్తటి పరుపూ వున్నాయి, బయటి ప్రపంచాన్ని చూడ్డానికి కిటికీ వుంది చదువుకోడానికి పుస్తకాలున్నాయి. ఇవన్నిటికంటే ముఖ్యంగా తనను ఆదరించే అన్నయ్య ఉన్నాడు, గౌరవించే తమ్ముడు వున్నాడు. ప్రేమించే అక్క చెల్లెళ్లు వున్నారు. మమతాను రాగాలు కురిపించే అమ్మ వుంది—

చటుక్కున తల్లి మాటలు గుర్తుకు వచ్చాయి రాజేంద్రకు. నేనున్నంతవరకు నీకేం పరవాలేదు కానీ నేను పోయిన తర్వాత నిన్ను కనిపెట్టుకుని ఉండడానికి ఓ మనిషి కావాలి కదా!?

"గభాలున కిటికీలోంచి ఇటు తిరిగాడు రాజేంద్ర. టేబిల్ మీద తల్లి వుంచిన




కవరందుకున్నాడు కుంటాడ్నని తెలిసి కూడా తనను పెళ్ళాడ్డానికి సిద్ధపడ్డ ఆ అమ్మాయి ఎలా వుందో చూద్దామన్న కుతూహలంతో కవర్లో వున్న ఫోటోను చేతిలోకి తీసుకొని చూశాడు. అంతే! ఆ ఫోటో మీద నుంచి దృష్టి మరల్చుకో లేక పోయాడు. అబ్బ! ఏం కళ్ళవి! చూడగానే ఎవర్నయినా ఇట్టే కట్టి పడే స్తాయి. కాస్త సోగదేరిన విశాలమయిన కళ్ళు, పొడవాటి కనురెప్పలు. వాటిని ఒక్కసారి ముద్దు పెట్టుకోని జన్మ వృధా అనిపించేంత అందంగా వున్నాయి ఆ కనురెప్పలు. ఇంక చూపులు ఎదుటి వారిని ఇట్టే ఆకర్షించి అరిగి దృష్టి మరల్చుకోలేనంతగా పిచ్చివాళ్ళని చేసే స్తాయి.

ఆ కళ్ళల్లోని కాంతి, ఆ మెరుపు అబ్బ! జీవితమంతా ఆ కళ్ళకేసి అలా చూస్తూనే గడిపేయాలన్న కోరిక కలుగు తుంది ఎవరికైనా.

ఫోటోలోనే ఇంత అందంగా ఉంటే ఇక నిజంగా చూస్తే ఈ అమ్మాయి కళ్ళు ఇంకెంత అందంగా ఉంటాయో!

రాజేంద్ర ఫోటోలోకి చూస్తూ చూస్తూ పరవశించిపోయి అలా మంచంమీద వెల్కిలా వాలాడు. ఎంత చూసినా తనివి తీరడం లేదతనికి. ఆ కళ్ళు అతనిని ఆహ్వానిస్తున్నాయి, కవ్విస్తున్నాయి, తనలో తీయని కోరికలను రేపుతున్నాయి.

రాజేంద్ర మనసులో అంతకంతకూ తీవ్రమౌతున్న కోరికను అణచుకోలేక చివరకు ఆ ఫోటోలోని అమ్మాయి కళ్ళను సున్నితంగా ముద్దుపెట్టుకున్నాడు. ఒక్కసారిగా ఒళ్ళు ఝల్లుమంది. వివ రించలేని మధురానుభూతి ఏదో శరీర మంతా పాకినట్టనిపించింది. ఆ హాయిని మరికాసేపు అనుభవించాలనిపించి కళ్ళు మూసుకు పడుకున్నాడు.

-అంత అందమైన కళ్ళున్న ఆ అమ్మాయి తన జీవితం గురించి ఎన్ని మధురమైన కలలు కందో? ఎన్నెన్ని సుందర దృశ్యాలను ఊహించుకుందో? భర్తతో కలిసి ఎన్నెన్ని ప్రదేశాలు చూడా లని ఆశపడిందో? తనను పెళ్ళి చేసు కుంటే వాటిల్లో ఏ ఒక్కటీ నెరవేరదని ఆమెకు తెలీదా? తెలిసికూడా ఒప్పుకుం దంటే ఆమె చాలా విశాల హృదయం గలదైనా అయివుండాలి లేక పరిస్థితులకు

తలవొగ్గి విధిలేక పెళ్ళికి అంగీకరించి వుండాలి. ఎందుకో జాలేస్తుంది. ఆ అమ్మాయిమీద తనని చేసుకుని ఏం సుఖపడదామనుకుందో పాపం!

-ఇలా ఆలోచనల్లో తేలిపోతున్న రాజేంద్రను మెల్లిగా నిద్ర ఆవరించేసింది.

ం ం ం

బయట ఏదో గందరగోళం వినిపించే సరికి హఠాత్తుగా మెలకువ వచ్చేసింది. రాజేంద్రకి. గభాలున లేచి కూర్చుని కిటికీలోంచి చూశాడు.

"అయ్యో పాపం....ఇంకా కుర్రాడు"

"అయ్యో! ఎంత రక్తమో...."

"ఏమైనా ఈకుర్రాళ్ళకు మరీ తొందరెక్కువ"

"మోటారు సైకిలుమీద కూర్చుంటే కళ్ళే కనిపించవు ఈ కాలపు కుర్రాళ్ళకు."


ఇలా రక రకాల వ్యాఖ్యానాలు విని పిస్తున్నాయి. రాజేంద్ర కళ్లు జనసమ్మర్థాన్ని చీల్చుకుని గుంపు మధ్యగా దృష్టి సారించాయి. అక్కడ బాగా దెబ్బలు తగిలి ధారగా రక్తం కారుతున్న ఓ కుర్రాణ్ని కొంత మంది కలిసి నెమ్మదిగా ఆటోలో పడుకోబెడు తున్నారు. ఆ కుర్రాడికి స్పృహ లేదు. ఎవరబ్బాయో అనుకున్నాడు రాజేంద్ర. చూస్తుండగానే పోలీసులు రావటం, అక్కడే ఓ పక్కగా ఆగివున్న మోటార్ సైకిలును స్వాధీన పర్చుకోవడం. పారిపోయిన దాని యజమానిని గాలించడానికి పోలీసులను పంపడం, కుర్రాణ్ని ఆస్పత్రికి తీసికెళ్లడం అంతా క్షణాలమీద జరిగిపోయింది. అక్కడ చేరిన జనం తలొక విధంగా మాట్లాడుతూ మెల్లిగా అక్కణ్నుంచి కదిలిపోయారు. కానేపటికిరోడ్డుమీద యధాప్రకారంగా వాహనాల రాకపోకలు ప్రారంభమయ్యాయి.

ఇలాంటి దృశ్యాలు చూసినప్పుడు రాజేంద్ర మనసంతా అదోలా అయిపోతుంది. గాయపడినవారిని తల్చుకుంటే అతని హృదయం ద్రవించిపోతుంది. మోటారుసైకిళ్లను చూస్తుంటే ఒళ్లు గగుర్పొడుస్తుంది. అసలు ఈవెధవ మోటార్ సైకిళ్లు తయారు చేయడమే మానేస్తే బాగున్ననిపిస్తుంది- ఇవి మనిషికి ఎంత ఉపకారం చేస్తాయో అంతగా అపకారమూ చేస్తాయి. వాటివల్ల ఎంత ఉపయోగముందో అంతటి ప్రమాదాలు కూడా జరుగుతుంటాయి. అందుకు తన కధే నిజమైన ఉదాహరణ....

తను కాలేజీలో చదువుతుండగా మోటర్ సైకిలు మీదతెగ తిరిగేవాడు. దానిమీద కూర్చుంటే తనకు ఒళ్లు తెలిసేదికాదు. అమితవేగంగా దూసుకుపోవట మంటే మహా సరదా తనకు. ఆసరదానే చివరకి తనబతుకునిలా పనికిరాకుండా చేసేస్తుందని ఊహించి వుంటే కొంచెం జాగ్రత్తగా మసులుకుని ఉండేవాడేమో! అమ్మ తనకెప్పుడూ చెబుతూనే వుండేది-

"కాస్త నిదానంగా వెళ్లురా బాబూ.... నువ్వు మోటార్‌సైకిల్ నడిపించే వేగం చూస్తుంటే నా గుండెల్లో రైళ్లు పరిగెడుతాయి" అని.

కాని వేడిరక్తం ఉరకలు వేస్తున్న వయసు కాబట్టి తను ఆమె మాటలు లక్ష్యపెట్టేవాడు కాదు, ఈ అమ్మదంతా చాదస్తం అని ఆమె మాటలను కొట్టి




పారేసి తన ఇష్టం వచ్చినట్టు తిరిగేవాడు. అయితే రోజులు ఎప్పుడూ ఒకేలా వుండవని ఆ భయంకర సంఘటన రుజువు చేసింది....

ఆరోజు తను, ఇంకో నలుగురు స్నేహితులూ కలిసి మోటార్ సైకిళ్లమీద పిక్నిక్ బయలుదేరారు. వెళ్లేటప్పుడు బాగానే వెళ్లారు కాని వచ్చేటప్పుడు........ అబ్బ తల్చుకుంటూంటే భయంతో తనగుండె ఆగిపోయినట్టనిపిస్తుంది తను ఎప్పటి వేగంతోనే నడుపుతున్నాడుబండిని. తన వెనుక కూర్చున్న స్నేహితుడు కంగారు పడిపోయాడు. కాస్త స్లోగా పోనీయరా! అంటూ మళ్ళీమళ్ళీ తనను బతిమాలుకున్నాడు "ఏం భయంలేదు బ్రదర్...నిన్ను సేఫ్‌గా తీసుకెళ్ళి సిటీలో వదిలిపెట్టే బాధ్యత నాది" అంటూ ఇంకా వేగంతో బండిని నడుపుతున్నాడు తను.

ఎదురుగా లారీ భూతాకారంగా తమ మీదకే వస్తున్నట్టనిపించింది ఒక్క క్షణం తనవెనక కూర్చున్న మిత్రుడు భయంతో బిగుసుకుపోయాడు. కానీ....ఎదురుగా వస్తున్న ఎడ్లబండిని తప్పించడం కోసం ఆ లారీ చప్పున పక్కకొచ్చేసింది. అంతే క్షణంలో వచ్చి మోటర్‌సైకిలుని గుద్దేసింది. అసలా లారీ అంత దగ్గరికి రాగానే తన చేతుల్లోని బాలెన్స్ తప్పిపోయింది. భయంతో గట్టిగా కళ్లు మూసేసుకున్నాడు.......మళ్ళీ తను కళ్లు తెరిసింది ఆస్పత్రిలోనే. అదికూడా వారం రోజుల తర్వాతే. తను కళ్లు తెరవడం చూసి తన వాళ్లందరూ ఆనందం పట్టలేకపోయారు. తలకీ, ముఖానికీ బలమైన గాయాలు తగలడం వల్ల తన కళ్లుపోతాయని అనుకున్నారట అంతా. కానీ స్పృహ వచ్చేదాకా ఏసంగతీ చెప్పలేమన్నారట డాక్టర్లు! తను అన్నీ చూడగలుగుతున్నానని చెప్పగానే వాళ్లు

ఆశ్చర్యపోయారు. "యూ ఆర్ ఎ లక్కీ ఫెలో! అంతటి ప్రమాదం నుంచి బతికి బయట పడ్డారంటే నిజంగా మీరు అదృష్టవంతులే! అందులోనూ కళ్లు డామేజ్ కాకుండా క్షేమంగా ఉండడం మరీ అదృష్టం. అంటూ తనను అభినందించారు డాక్టర్లు. కానీ తనకాళ్లు?. పూర్తిగా చితికిపోయినందువల్ల మోకాలివరకూ రెండు కాళ్ళు తీసేయాల్సి వచ్చిందట! ఈ సంగతి తెలిసి తను వెక్కి వెక్కి ఏడ్చేశాడు. నన్నెందుకు చావకుండా బతికించారు? అంటూ అందరిముందూ విరుచుకుపడ్డాడు. అప్పుడు అమ్మ తనను ఓదార్చింది. నువ్వు లేకపోతే నేను బతకగలనా? అని ఏడ్చింది. కాళ్లు పోయినంత మాత్రాన బతకడం అనవసరం అనుకోవడం అవివేకమని హితబోధ చేసింది. తనకు కావల్సిన సౌకర్యాన్నీ అమర్చి పెట్టి ఈ మేడమీద గదిలో తనుండే ఏర్పాటు చేసింది.

కాళ్లు పోయినా ఒకచోట పడివుండొచ్చు కానీ కళ్లుపోయివుంటే మాత్రం తను బతికీ చచ్చిన వాడికిందే జమ అయ్యేవాడు. అప్పుడీ జీవితం నిజంగా అంధకారమై ఉండేది. రాత్రో, పగలో తెలీక గంటలు, రోజులు, నెలలు సంవత్సరాలు గడపాల్సి వచ్చేది. ఆ పరిస్థితి కలగనందుకు తన అదృష్టాన్ని అభినందించకుండా వుండలేక పోయాడు.

రాజేంద్ర పెదవుల మీద నవ్వు మెరిసింది. అద్దం తీసుకుని అందులో తన కళ్లను తనివితీరా చూసుకున్నాడు. అంతలో ఇందాకటి ఫోటోలోని అమ్మాయి కళ్లు గుర్తుకొచ్చి తిరిగి ఆ ఫోటోను చేతిలోకి తీసుకున్నాడు. ఒక చేత్తో అద్దాన్ని, ఇంకో చేత్తో ఫోటోనీ మార్చి మార్చి చూస్తూ ఇద్దరి కళ్ళనూ పోల్చి చూశాడు. తనకే కళ్లు లేనట్టయితే ఇప్పుడు ఇంత అందమైన కళ్ళని చూడగలిగేవాడేనా?

అంతలో ఎక్కడినుంచో బాండు మేళం వినిపించింది. అంతకంతకూ దగ్గరవుతున్న ఆబాండు మేళం వింటూనే ఏదో పెళ్ళి ఊరేగింపు ఇటే వస్తున్నట్టనిపించింది.

రాజేంద్ర నెమ్మదిగా లేచి బయటకు చూశాడు. నిజమే! అటూ ఇటూ వరసగా కొందరు మనుషులు ట్యూబ్ లైట్లు మోసుకు వస్తుంటే ఆ వెలుగులో పూల రథంలా అలంకరించినకారులో కూర్చున్న వధూవరులు దేవతల్లా మెరిసిపోతున్నారు. దర్జాగా, ఠీవిగా కూర్చున్న ఆ పెళ్ళికొడుకుస్థానంలో తననీ, సిగ్గుతో మొగ్గలా ముడుచుకుని అప్పుడప్పుడు కళ్లెత్తి చుట్టూచూసే పెళ్ళికూతురు స్థానంలో ఫోటోలోని అమ్మాయినీ ఊహించుకున్న రాజేంద్ర కొన్ని క్షణాలపాటు ఏదోస్వప్న లోకంలో విహరించాడు.

ఆ స్వప్నం పూర్తయిపోయి మళ్ళీ వాస్తవంలోకి వచ్చాక వెనుదిరిగి మంచం దగ్గరకివచ్చాడు. ఎదురుగా ఆ అమ్మాయి కళ్లు తనను కవ్విస్తున్నట్లనిపించింది.

(అంతర్జాతీయ వికలాంగుల సంవత్సర సందర్భంగా ఈ చిరు కానుక. వెలుగుకు నోచుకోని లక్షలాది సోదరులకు ఈ కథ అంకితం) ★